క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

కోటనందూరు: ఓటుహక్కు వినియోగంపై గురువారం కోటనందూరులో అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఓటుహక్కు ప్రాధాన్యతపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి జి. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దృఢమైన సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఓటర్లంతా పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

102 మంది రక్తదానం

తొండంగి: మండలంలోని వేమవరంలో గురువారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్ఫూర్తి ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరాన్ని జాతీయ ఉత్తమ హేచరీస్ అవార్డు గ్రహీత, పారిశ్రామిక వేత్త, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణరెడ్డి(పెదబాబు) ప్రారంభించారు. కోనప్రాంతానికి చెందిన 102 మంది యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.రక్తదానం చేసిన యువతకు పెదబాబు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారేటి కృష్ణ, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు, యువసేన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణంలోని కొత్త సూరవరం, కోర్టు వీధి, బ్యాంకు కాలనీ, బత్తాయితోట వీధి, సమితి ఆఫీసు, దుర్గాదాస్ వీధి, రెడ్ కాన్వెంట్, కొత్తపేట, శాంతినగర్, సినిమా రోడ్డు, సూరవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

కోటనందూరు మండలంలో...

కోటనందూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మత్తులు, విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని కాకరాపల్లి, జగన్నాథపురం, భీమవరపుకోట, ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట, బంగారయ్యపేట, బిళ్లనందూరు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రౌతులపూడి మండలంలో...

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గిడజాం ఫీడర్ పరిధిలోని ఎస్.అగ్రహారం, ఎన్ఎన్ పట్నం, రౌతులపూడి రూరల్ ఫీడర్ పరిధిలోని బంగరయ్యపేట, శృంగవరం, ఎం.చామవరం, పి.చామవరం, కోడూరు, పారుపాక గ్రామలకు ఉదయం 7 నుంచి గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా

ఏలేశ్వరం: ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న తమపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండలంలోని లింగంపర్తిలో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గ్రామంలోని 30 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ఎస్. మోహన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల ఇళ్ల వద్దకే సేవలు అందిస్తున్న తమపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. తమను విధులకు దూరం చేయడం ద్వారా వృద్ధులకు, వికలాంగులు ఇబ్బందులు పడేలా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నవరం: ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమపై ప్రతిపక్ష నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడానికి నిరసనగా అన్నవరం వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు వలంటీర్లు కొండపల్లి శ్రీసూర్య, బొబ్బిలి శ్రీనివాస్, అయినవల్లి నానిబాబు, కొత్త శివ తమ రాజీనామా పత్రాలను గురువారం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అందజేశారు.

గోకవరంలో 19 మంది ...

గోకవరం: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. తాజాగా గురువారం గోకవరానికి చెందిన 19 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను అధికారులకు సమర్పించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేసినట్టు వలంటీర్లు పేర్కొన్నారని ఎంపీడీఓ గోవిందు తెలిపారు.



విజయవంతం చేసేందుకు.. మేమంతా సిద్ధం

- నేడు జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల మీదుగా మేమంతా సిద్ధం బస్సుయాత్ర
- ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి
- పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం

జనహృదయ నేత, సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని రీతిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి.. పారదర్శకంగా వాటిని అమలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, మెట్టప్రాంత ప్రజానీకం సిద్ధమయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం జిల్లాలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో జరగనుంది. జిల్లా కేంద్రం కాకినాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం సిద్ధం బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఈ సభకు మూడు నియోజకవర్గాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీగా తరలివెళ్లేందుకు రెడీ అయ్యారు. తన పాలనతో తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చేందుకు మేమంతా సిద్ధమని ముక్తకఠంతో చెబుతున్నారు.

తుని: జననేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కాకినాడలో నిర్వహించే సిద్ధం బహిరంగ సభకు తరలివెళ్లడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నియోజకవర్గంలోని నాయకులతో గురువారం సిద్ధం సభ విజయవంతంపై సమీక్షించారు. తమ అభిమాన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు తహతహలాడుతున్నారు. సంక్షేమ సారథి చెప్పే మాటలను వినేందుకు సన్నద్ధమయ్యారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని పట్టణం నుంచి అశేష సంఖ్యలో జనం తరలివెళ్లడానికి వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి...

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శుక్రవారం కాకినాడ జిల్లాలోకి ప్రవేశించనుంది. కాకినాడలో జగనేత జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ బస్సుయాత్ర, బహిరంగ సభకు తరలివెళ్లేందుకు పార్టీశ్రేణులు సిద్ధమయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో వేలాదిగా తరలివెళ్లనున్నారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో మేమంతా సిద్ధం సభకు పయనమవుతున్నారు. తొలుత ప్రత్యేక వాహనాల్లో ప్రత్తిపాడు చేరుకుని మధ్యాహ్నం నామినేషన్ అనంతరం కత్తిపూడి మీదుగా కాకినాడ వెళ్లనున్నారు. అక్కడ నుంచి బస్సుయాత్ర ద్వారా కత్తిపూడి చేరుకుని అక్కడ యాత్రకు వీడ్కోలు పలకనున్నారు. ఈ మేరకు నియోజవర్గవ్యాప్తంగా పార్టీ శ్రేణులు, మహిళలకు ప్రత్యేక వాహనాలు సమకూర్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఉరకలేస్తున్నారు.

జననేత కోసం ఎదురుచూపులు

గోకవరం: ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వేళ మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం మెట్ట ప్రాంతమైన జగ్గంపేట మీదుగా సాగనుంది. గండేపల్లి మండలం రామేశంపేట వద్ద నియోజకవర్గంలోకి ప్రవేశించనున్న బస్సుయాత్రకు ఘనంగా స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీగా అభిమానులు తరలివచ్చి జననేతకు స్వాగతం పలకనున్నారు. ఇందు కోసం తోట నరసింహం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అలాగే తమ అభిమాన నాయకుడు తమ ప్రాంతానికి రానుండటంతో ప్రజలు సైతం భారీ ఎత్తున సీఎంను చూసేందుకు తరలిరానున్నారు. బస్సుయాత్ర నియోజకవర్గంలోకి ప్రవేశించే రామేశంపేట వద్ద సీఎంకు స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేశారు. ఎటుచూసినా వైఎస్సార్ సీపీ జెండాలతో ఆ ప్రాంతం నిండిపోయింది. నియోజకవర్గంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర బస్సుయాత్ర సాగనుండటంతో తమ అభిమాన నేతకు స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

జగ్గంపేట నియోజకవర్గం మీదుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే మేమంతా సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కిర్లంపూడిని వీరవరంలోని ఆయన స్వగృహంలో పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున రామేశంమెట్ట వద్దకు చేరుకుని సీఎంకు స్వాగతం పలకాలని సూచించారు.

నేడు 'వరుపుల' నామినేషన్


సుబ్బారావు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ శ్రేణులతో ర్యాలీగా ఆయన ప్రత్తిపాడు చేరుకుంటారు. తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2 గంటలలోపు తన నామినేషన్ పత్రం అందజేస్తారు. అనంతరం కాకినాడలో జరిగే మేమంతా సిద్ధం సభకు పార్టీశ్రేణులతో కలిసి ర్యాలీగా బయలుదేరుతారు. అక్కడ నుంచి తిరిగి కత్తిపూడి వరకూ బస్సుయాత్రలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీశ్రేణులు నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజక వర్గానికి తొలిరోజు గురువారం నామినేషన్లు దాఖలు కాలేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. అయితే తొలిరోజు నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్వో ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజలకు వివరిస్తూ, పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి పాటు పడాలని సూచించారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, ప్రత్తిపాడు కాంగ్రెస్ అభ్యర్థి నీరుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక

- కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి రాజా

తుని: ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని, కోటనందూరు మండలాలకు చెందిన 100 మంది గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో కోటనందూరు మండలం ఇండుగపల్లి, కోటనందూరు, తుని మండలం తిమ్మాపురం, తాళ్లూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో టీడీపీకి చెందిన పలువురు కీలక నేతలు ఉన్నారు. పార్టీ విజయం కోసం పని చేయాలని మంత్రి రాజా వారికి సూచించారు.

పలువురి చేరిక

తుని మండలం ఎస్.చామవరం మాజీ సర్పంచ్ సగరపు నాగబాబు తన అనుచరులతో కలిసి గురువారం వెఎస్సార్ సీపీలో చేరారు. ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వీరికి మంత్రి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో కష్టపడి పని చేసినా గుర్తింపు లేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చి వైఎస్సార్ సీపీలో చేరినట్లు నాగబాబు తెలిపారు. తుని నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మంత్రి రాజా నాయకత్వం పట్ల నమ్మకం పెరిగిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి రాజా భరోసా ఇచ్చారు.


పార్టీలో చేరిన వారితో మంత్రి రాజా


వైఎస్సార్ సీపీలో చేరిన నాగబాబు తదితరులతో మంత్రి దాడిశెట్టి రాజా

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- కత్తిపూడిలో 200 మంది మద్దతు

శంఖవరం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో సర్పంచ్ కొల్లు సత్తిబాబు, పెయ్యల కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 200 మంది వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపారు. నెల్లిపూడిలో ఎంపీటీసీ పిర్ల నాగేశ్వరరావు, బద్ది తాతాలు ఆధ్వర్యంలో సుమారు 100 మంది జైభారత్ నేషనల్ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ పరిశీలకుడు గౌతు నాగు, ఆపర్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, పార్టీ నాయకులు గౌతు అర్జుబాబు, గౌతు వాసు, బద్ది తాతాబ్బాయి, అడపా సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 400 మంది చేరిక

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో బర్ల గోవింద్ ఆధ్వర్యంలో 400 మంది గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గుడాల రామకృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, శెట్టి సత్తిబాబు, అవ్వ ఆదినారాయణ,బర్ల రమణ , కోర్ని కష్ణ, కిల్లాడి బాబురావు కిలాడి దుర్గ, కురందాసు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ...

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీకి మద్దతుగా గురువారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీం ద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు తదతరులు పాల్గొన్నారు.


కత్తిపూడిలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తోట నరసింహం


నీలాద్రిరావుపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి, శ్రీనిధి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పార్టీలో పలువురి చేరిక

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని శృంగరాయునిపాలేనికి చెందిన టీడీపీ నాయకులు దొంగర వీరవెంకట సత్యనారాయణ, బిర్ర తాతాజీ, పప్పల బాబూజీ, బస్వా కృష్ణ, కొమరి రాము, నామాల వీరబాబు, గవర శివ, కంఠమరెడ్డి సత్తిబాబుతో పాటు కిర్లంపూడి ఎస్సీపేట చెందిన మరికొందరు గురువారం వీరవరంలో తోట నరసింహం, తోట రాంజీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరి తోట నరసింహం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. శుక్రవారం కాకినాడలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం బహిరంగ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, సచివాలయాల మండల కన్వీనర్ జోకా శ్రీను, గరగ పెద్దకాపు, బస్వ శివ, కంటి లోవ, వనపర్తి రమేష్, నడిపల్లి గోవిందు, మాదరపు వెంకట రమణ, బొర్ర శాంతిమోహన్, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి

జగ్గంపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపురంలో పార్టీ నేత ఇళ్ల అప్పారావు కాపు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ పార్లమెంట్ అబ్జర్వర్ గుబ్బల తులసికుమార్, నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్, పార్టీ నేత అత్తులూరి సాయిబాబు, మండలాధ్యక్షుడు రావుల గణేష్ రాజా, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ అధ్యక్షులు గఫూర్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

గండేపల్లి: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి కోరారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో గురువారం తోట వాణి, ఆమె కోడలు శ్రీనిధితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకి శ్రీను, ఎంపీటీసీ రేక నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- తోట నరసింహం తనయుడు తోట రాంజీ
- కామరాజుపేటలో ఎన్నికల ప్రచారం

గోకవరం: కులమతాలు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని కామరాజుపేటలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న తీరును ప్రజలకు వివరించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తన తండ్రి తోట నరసింహన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. సొసైటీ చైర్మన్ దాసరి చిన బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, సుంకర వెంకటరమణ, ఎంపీటీసీ మజ్జూరి బాబ్జి, పార్టీ నాయకులు జాజుల ప్రసాద్, శింబోతుల శ్రీను, గొంతెన అర్జున్, గంర్రెడ్డి త్రిమూర్తులు, ముమ్మన అర్జునరావు, యర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కామరాజుపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

హిందూ ధర్మానికి పెద్దపీట

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్

గండేపల్లి: ప్రభుత్వం హిందూ ధర్మానికి పెద్దపీట వేసి, ఆలయాల పరిరక్షణకు చర్యలు తీసుకుందని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. మండలంలోని మల్లేపల్లి రామాలయంలో సీతారాములను గురువారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. తొలుత అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం, పూజల అనంతరం ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ నాయకుడు ముత్యాల శ్రీనివాస్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, మాజీ జెడ్పీటీసీ బిత్రా గిరిబాబు, గుత్తుల గంగాధర్ తదితరులు ఉన్నారు.


మల్లేపల్లి రామాలయంలో సునీల్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

విస్తృతంగా వాహనాల తనిఖీలు

కిర్లంపూడి: ఎన్నికల నేపథ్యంలో కిర్లంపూడిలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ మక్కా చిన్నారావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. రూ. 50 వేలు మించి నగదు తీసుకువెళితే తగిన ఆధారాలు చూపించాలన్నారు. అక్రమంగా మద్యం, ఇతర సామగ్రి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీలు నూకరాజు, బాలాజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ, కృష్ణ పాల్గొన్నారు.

మైక్రోస్కోప్ బహూకరణ

తొండంగి: ఐదేళ్ల పాటు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకోవాలి అనుకున్నాడు ఆ విద్యార్థి. తన తండ్రి సహకారంతో రూ.15 వేల విలువైన మైక్రోస్కోప్‌ను గురువారం పాఠశాలకు బహూకరించాడు. వివరాల్లోకి వెళితే తొండంగి మండలం ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్లో అన్నవరానికి చెందిన ఆకొండి కిరణ్ అత్రిష్ ఆరో తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి ఆకొండి కిరణ్‌కుమార్ రత్నగిరిపై వ్రత పురోహితునిగా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అత్రిష్ అన్నవరం నుంచి ప్రతి రోజూ ఎలక్ట్రిక్ సైకిల్‌పై పాఠశాలకు వెళ్లి పట్టుదలతో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యాడు. గత నెల మార్చిలో టెస్ట్ ఎగ్జామ్స్ రాశాడు. ఐదేళ్ల పాటు తాను చదివిన పాఠశాల రుణం తీర్చుకోవాలని భావించిన అత్రిష్ తన తండ్రి కిరణ్‌కుమార్ సహకారంతో రూ.15 వేలు విలువైన ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్ బహూకరించాడు. ఈ మేరకు అత్రిష్ తండ్రి కిరణ్‌కుమార్ గురువారం పాఠశాల హెచ్ఎం ఎ.లక్ష్మీమాణిక్యానికి మైక్రోస్కోప్ అందజేశారు. విద్యార్థి కిరణ్ అత్రిష్‌ను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గర్లంకి పెంటయ్యదొర(బాబ్జి), సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, బెక్కం చంద్రగిరి, ఎంపీటీసీలు నందెపు చిన్న పాల్గొన్నారు.


హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీమాణిక్యానికి మైక్రోస్కోప్‌ను అందజేసిన విద్యార్థి అత్రిష్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

తుని: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తుని అగ్నిమాపకాధికారి కె.రాముడు సూచించారు. స్థానిక ఆదిత్య కళాశాలలో గురువారం ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రాథమిక సమాచారం తెలుసుకుంటే చిన్న చిన్న ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. కళాశాల అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


తునిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది